RNI NO:APTEL /2023/90201

రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు

గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు

నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు

మండలాల వారిగా విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 348 | 08 ఆదివారం నవంబర్ 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

ప్రశాంతంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాట్ల తనిఖీ

స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ పెట్టెల భద్రత పరిశీలన

కౌంటింగ్ ఏజెంట్లతో మాట్లాడి వివరాల సేకరణ

2

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వజ్రోత్సవాల్లో గవర్నర్

లోక్‌భవన్ దర్బార్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం
ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొనడం
స్కౌట్స్, గైడ్స్ సేవలకు గుర్తింపు



విజయవాడ, రాజధాని వాయిస్ : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆంధ్రప్రదేశ్ సంఘం 75వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ లోక్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆంధ్రప్రదేశ్ సంఘానికి గౌరవ పరిరక్షకుడిగా వ్యవహరిస్తున్న ఆయన వేడుకల్లో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంఘం స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించారు. యువతలో క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు స్కౌట్స్, గైడ్స్ సంస్థలు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. విద్యార్థులను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఇలాంటి సంస్థల పాత్ర కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు. - మిగతా 2లో..

వైకాపా కంచుకోటలో రెపరెపలాడిన తెదేపా జెండా

కడప: ఉమ్మడి కడప జిల్లాలో కూటమి ప్రభంజనం సృష్టించింది. భారీ మెజార్టీలతో కూటమి అభ్యర్థులు సంచలనం సృష్టించారు. జిల్లా వ్యాప్తంగా 39 జడ్పీటీసీ స్థానాలు ఉంటే.. 23 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 16 స్థానాలకు 71 మంది అభ్యర్థులు పోటీపడగా.. 13 స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. నందలూరు జడ్పీటీసీ కౌంటింగ్ కొనసాగుతోంది. వేంపల్లి, వేముల మండలాల్లో వైకాపా అభ్యర్థులు విజయం సాధించారు. మొత్తం మీద తెదేపా 30, భాజపా 3, జనసేన 3 సాధించగా.. వైకాపా రెండు స్థానాలకే పరిమితమైంది. జగన్ సొంత ఊరు పులివెందుల జడ్పీటీసీ స్థానంలో తెదేపా జడ్పీటీసీ అభ్యర్థి భారతి 1,463 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రాజంపేట మండలం నుంచి తెదేపా అభ్యర్థి పోలి సుబ్బారెడ్డి 17,440 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.కడప జిల్లాలో 351 ఎంపీటీసీ స్థానాలు ఇప్పటికే కూటమికి ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 55 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగితే.. 30కి పైగా స్థానాల్లో కూటమి అభ్యర్థులు సత్తా చాటారు. మరి కొన్ని చోట్ల ఇండిపెండెంట్లు విజయం సాధించారు. అక్కడక్కడ వైకాపా అభ్యర్థులు గెలుపొందారు.

విశాఖలో పెట్టుబడుల సదస్సుకు భారీ ఏర్పాట్లు

ఈ నెల 12, 13 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు
59 దేశాల నుంచి ప్రతినిధులు.. 15 మంది విదేశీ మంత్రులు
పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలపై ప్రత్యేక చర్చలు
ఏపీలో పెట్టుబడులు సురక్షితం.. సులభతరమని చాటాలి: చంద్రబాబు



అమరావతి, రాజధాని వాయిస్ : విశాఖపట్నంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు--2026 ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. 'మారుతున్న ప్రపంచ వ్యవస్థలో వాణిజ్యం, సాంకేతికత, విశ్వాసం' అనే ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహించ నున్నారు. ఇందులో పాల్గొనేందుకు 59 దేశాల నుంచి ప్రతినిధులు రానుండగా, 15 మంది విదేశీ మంత్రులు కూడా భాగస్వాములు కానున్నారు. సదస్సులో చర్చించాల్సిన అంశాలు, రూపొందించాల్సిన తీర్మానాలపై ముఖ్యమంత్రి అధికారులతో పాటు భారత పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులతో చర్చించారు.ప్రపంచవ్యాప్తంగా మారుతున్న వాణిజ్య పరిస్థితులు, సాంకేతిక పరిణామాల నేపథ్యంలో ఈ సదస్సును కీలక వేదికగా మలచాలని చంద్రబాబు సూచించారు. విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, పరిశ్రమల ప్రతినిధులు, విద్యాసంస్థలు, అంకుర సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావాలని నిర్దేశించారు. కేవలం చర్చలకే పరిమితం కాకుండా, వాటి ద్వారా వ్యాపార అవకాశాలు, సాంకేతిక సహకారం, అంతర్జాతీయ భాగస్వామ్యాలు పెరిగేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. - మిగతా 2లో..

రెండు నెలల పసికందు కిడ్నాప్ కేసు ఛేదింపు



2

ఏటుకూరు రోడ్డులో చిన్నారి అపహరణ

ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన లాలాపేట పోలీసులు

సురక్షితంగా చిన్నారిని రక్షించిన పోలీసు బృందం

తల్లి పక్కన నిద్రిస్తుండగా అపహరణ.. కలకలం

రీకౌంటింగ్ కోసం రోజా నిరసన

నగిరి కౌంటింగ్ కేంద్రం ఎదుట వైసీపీ బైఠాయింపు
ఇల్లత్తూరు ఎంపీటీసీ ఫలితంపై వివాదం
వైసీపీ గెలిచినా టీడీపీకి విజయం ప్రకటించారంటూ ఆరోపణ
న్యాయం చేయాలని మాజీ మంత్రి ఆర్కే రోజా డిమాండ్



నగిరి, రాజధాని వాయిస్ : చిత్తూరు జిల్లా నగిరిలో ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఫలితంపై వివాదం నెలకొంది. విజయపురం మండలం ఇల్లత్తూరు ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించినప్పటికీ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలిచినట్లు అధికారులు ప్రకటించారంటూ వైసీపీ నేతలు ఆరోపించారు. ఈ ఫలితంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రీకౌంటింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. రీకౌంటింగ్ కోరుతూ సంబంధిత అధికారులను సంప్రదించినప్పటికీ స్పందన లేదని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఓట్ల లెక్కింపులో తప్పులు జరిగాయని, ఫలితాన్ని మరోసారి పరిశీలించి వాస్తవ విజేతను ప్రకటించాలని కోరారు. తమ అభ్యర్థికి వచ్చిన ఓట్ల వివరాలను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. - మిగతా 2లో..

ప్రజాతీర్పును అపహాస్యం చేయడం జగన్‌కు అలవాటుగా మారింది: పల్లా



అమరావతి, రాజధాని వాయిస్ : పట్టణం నుంచి పల్లె వరకు కూటమి సుపరిపాలనకు ప్రజలు పట్టం కట్టారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతెలిపారు. కూటమి ఘన విజయానికి సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైకాపా ఎన్ని విధ్వంసాలు సృష్టించినా ప్రజలు కూటమి పార్టీలకే జై కొట్టారని, ఈ విజయం కేవలం ఎన్నికల్లో గెలుపు మాత్రమే కాదని.. కూటమి పాలనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఎన్నికల విధానంపై జగన్ చేస్తున్న వ్యాఖ్యలు 2.60 కోట్ల మంది ఓటర్లను అవమానించేలా ఉన్నాయని విమర్శించారు. జగన్ ఎన్ని అబద్ధాలు చెప్పినా, విధ్వంసాలకు పాల్పడినా ప్రజలు అభివృద్ధి వైపే మొగ్గు చూపారని స్పష్టం చేశారు. ఈవీఎంలైనా, బ్యాలెట్ బాక్సులైనా ప్రజల మద్దతు కూటమికే ఉందని, ప్రజాతీర్పును అపహాస్యం చేయడం జగన్‌కు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. చొక్కా మడత పెడతామంటే భయపడే పరిస్థితుల్లో ప్రజలు లేరని జగన్ తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ విజయం పాలనపై తమ బాధ్యతను మరింత పెంచిందని, ఇదే స్ఫూర్తితో 2029 ఎన్నికల్లోనూ కూటమి విజయం సాధించడం ఖాయమని పల్లా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు.

జడ్పీల్లోనూ జయహో

జిల్లా పరిషత్ ఎన్నికల్లో కూటమి ఘనవిజయం
మండల పరిషత్ పోరులోనూ విజయభేరి
రెండున్నరేళ్ల అభివృద్ధి, సంక్షేమపథానికి జన నీరాజనం
ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ వైకాపాకు ఎదురుదెబ్బ



అమరావతి, రాజధాని వాయిస్ : గ్రామీణ ఓటర్లూ అధికార కూటమికే జై కొట్టారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన ఏకపక్ష విజయంతో ఉత్సాహం ఉరకలెత్తుతున్న తెదేపా, జనసేన, భాజపా కూటమికి.. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ రాష్ట్ర ప్రజలు అద్వితీయ విజయం కట్టబెట్టారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ అందరూ కూడబలుక్కుని ఓట్లు వేసినట్టుగా కూటమికి నీరాజనం పట్టారు. పులివెందులా, పుంగనూరా, ఇచ్ఛాపురమా, అనకాపల్లా అన్న తేడా లేకుండా వైకాపాను అధికార కూటమి కోలుకోలేని దెబ్బతీసింది. వైకాపాకు గట్టి పట్టుందని భావించే రాయలసీమలోనూ ఆ పార్టీని మట్టి కరిపించింది. పార్టీ అధ్యక్షుడు జగన్ సొంత నియోజకవర్గంలోని పులివెందులలోనూ వైకాపాకు చావుదెబ్బ తప్పలేదు. ఇటీవల పులివెందుల మున్సిపాలిటీలో ఘన విజయం సాధించిన కూటమి.. ఇప్పుడు అక్కడ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్నీ గెలుచుకుని జగన్ సొంత గడ్డపై వైకాపా ఓటమిని సంపూర్ణం చేసింది. రాష్ట్రంలో మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు 77 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 582 స్థానాలకు ఈ నెల 5న పోలింగ్ జరిగింది. శనివారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయానికి వెలువడిన ఫలితాల్లో అధికార కూటమి 473 స్థానాలు గెలిచింది. వైకాపా 57 స్థానాలకే పరిమితమైంది. మొత్తం 9,821 ఎంపీటీసీ స్థానాలకుగాను 2,051 ఏకగ్రీవమవగా, 7,767 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. 3 చోట్ల ఎన్నికలు జరగలేదు. కడపటి ఫలితాలు వెలువడేసరికి కూటమి 5,819 స్థానాల్లో విజయంతో దూసుకెళ్లగా వైకాపా 1,583 స్థానాలు గెలిచింది. మొత్తం ఎంపీపీల్లో రెండు మూడు తప్ప మిగతావన్నీ కూటమికే దక్కనున్నాయి. కూటమి మధ్య సమన్వయం లేక, స్థానికంగా గ్రూపు రాజకీయాల కారణంగా రెబల్స్‌గా బరిలోకి దిగినవారిలో కొందరు గెలిచారు. వారు కూటమివైపే వచ్చే అవకాశముంది. శనివారం పోస్టల్ బ్యాలట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి తుది ఫలితాలు వెలువడే వరకు - మిగతా 2లో..

బొండపల్లిలో మాజీ మంత్రి బొత్స కుమార్తె ఓటమి

బొండపల్లి, రాజధాని వాయిస్ : పరిషత్ పోరులో కూటమి విజయపరంపర కొనసాగుతోంది. విజయనగరం జిల్లాలోని బొండపల్లి జడ్పీటీసీ స్థానంలో తెదేపా(ఇన్ఫా) అభ్యర్థి గెలుపొందారు. ఇక్కడి నుంచి పోటీ చేసిన వైకాపా నేత, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కుమార్తె అనూష ఓటమి పాలయ్యారు. బొత్స అనూషపై తెదేపా అభ్యర్థి పాశల నీరజ 5,136 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నీరజ విజయంతో బొండపల్లిలో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ రేసులో ఉన్న అనూష ఓటమి పాలవడంతో వైకాపా శ్రేణులు డీలాపడ్డాయి.వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కుటుంబం నుంచి నలుగురు జడ్పీటీసీ అభ్యర్థులుగా బరిలోకి దిగాలని ప్రయత్నించారు. పూసపాటిరేగ జడ్పీటీసీ స్థానానికి బొత్స తమ్ముడి కుమారుడు చైతన్య నామినేషన్ తిరస్కరణకు గురైంది. బొండపల్లి నుంచి కుమార్తె అనుష, గరివిడి నుంచి కోడలు బొత్స పూజిత, గుర్ల మండలం నుంచి బొత్స సోదరి సంగంరెడ్డి వెంకటలక్ష్మి పోటీ చేశారు. గరివిడి జడ్పీటీసీగా బొత్స పూజిత విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, తెదేపా అభ్యర్థి కిమిడి సంధ్యపై 1,599 ఓట్ల మెజార్టీతో పూజిత గెలుపొందారు. స్థానిక ఎన్నికలకు ముందు తెదేపాలో చేరిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) కుమార్తె సిరి సహస్ర తెర్లాం జడ్పీటీసీ స్థానం నుంచి విజయం సాధించారు.

ప్రశాంతంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు

గుంటూరు, రాజధాని వాయిస్ : రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. పెదకాకాని, ఫిరంగిపురం మండలాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, లెక్కింపు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా లెక్కింపు సజావుగా సాగుతున్న తీరును పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అధికారులు చేపట్టిన ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. లెక్కింపు సిబ్బందికి కల్పించిన సదుపాయాలు, కేంద్రాల నిర్వహణ, భద్రతా చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓట్ల లెక్కింపులో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి దశలోనూ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా ప్రక్రియను కొనసాగించాలని స్పష్టం చేశారు.స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచిన బ్యాలెట్ పెట్టెల భద్రతను అనిల్ చంద్ర పునేఠ ప్రత్యేకంగా తనిఖీ చేశారు. వాటి భద్రతకు చేపట్టిన చర్యలను పరిశీలిం చి సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. కౌంటింగ్ ఏజెంట్లతో మాట్లాడి లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. ఏజెంట్లకు ఎదురవుతున్న ఇబ్బందులు, కేంద్రాల్లో ఉన్న పరిస్థితులపై ఆరా తీశారు. ఎన్నికల లెక్కింపు సందర్భంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. కేంద్రాల్లోకి అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే పంపించాలని, భద్రతా ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని పేర్కొన్నారు.



లెక్కింపు ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రిటర్నింగ్ అధికారులు హిమశైలజ, మయూరి, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల కమిషనర్ వెంట వెళ్లి కౌంటింగ్ కేంద్రాల్లోని ఏర్పాట్లను వివరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

రెండు నెలల పసికందు కిడ్నాప్ కేసు ఛేదింపు

గుంటూరు, రాజధాని వాయిస్ : ఏటుకూరు రోడ్డులో రెండు నెలల పసికందు అపహరణ ఘటన కలకలం రేపింది. తల్లి పక్కన నిద్రిస్తున్న చిన్నారిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చిన్నారి కనిపించక పోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన లాలాపేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పసికందు ఆచూకీ కోసం ప్రత్యేకంగా చర్యలు ప్రారంభించారు. కేవలం రెండు నెలల వయసున్న చిన్నారి అపహరణ కావడంతో పోలీసులు కేసును తీవ్రంగా పరిగణించారు. ఘటనకు సంబంధించిన పరిస్థితులు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు. చిన్నారిని వీలైనంత త్వరగా సురక్షితంగా గుర్తించడమే లక్ష్యంగా విచారణ కొనసాగించారు. ఈ క్రమంలో అపహరణకు సంబంధించి కీలక ఆధారాలను సేకరించి నిందితుల ఆచూకీపై దృష్టి సారించారు .దర్యాప్తులో భాగంగా ఐదుగురు నిందితులను పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. వారి ప్రమేయంపై విచారణ చేపట్టి పసికందు అపహరణ వెనుక ఉన్న పరిణామాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. చిన్నారిని ఎక్కడికి తీసుకెళ్లారు, ఈ ఘటనకు దారితీసిన కారణాలేమిటనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. నిందితుల అరెస్టుతో కేసు దర్యాప్తులో కీలక పురోగతి సాధించినట్లయింది. పోలీసు లు అపహరణకు గురైన రెండు నెలల పసికందును సురక్షితంగా రక్షించారు. చిన్నారిని తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. తమ బిడ్డ క్షేమంగా లభించడంతో తల్లిదండ్రులు ఊరట చెందారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని కూడా పరిశీలించాల్సిన అవసరాన్ని పోలీసులు గుర్తించారు. పసికందును సురక్షితంగా గుర్తించడం ఈ కేసులో కీలక పరిణామంగా నిలిచింది. ఈ ఘటనలో ఐదుగురు నిందితుల అరెస్టుతో లాలాపేట పోలీసులు కేసును ఛేదించారు. అయితే అపహరణకు సంబంధించిన పూర్తి వివరాలు, నిందితుల మధ్య సంబంధాలు, చిన్నారిని అపహరించడానికి గల కారణాలపై మరింత సమాచారం వెల్లడికావాల్సి ఉంది. దర్యాప్తులో వెలుగు చూసే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు



తీసుకోను న్నారు. చిన్నారుల భద్రత విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

జనసేన ఎంపీటీసీ అభ్యర్థి మరణించినా.. విజయం వరించింది

దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ధుమంతునిగూడెంలో జనసేన ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన గారపాటి దివ్య(28) గుండెపోటుతో నిన్న మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం జరిగిన ఓట్ల లెక్కింపులో సమీప ప్రత్యర్థిపై 350 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. డిగ్రీ పూర్తిచేసిన దివ్యకు శ్రీనివాస్‌తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఐదేళ్లు, 3 నెలల వయసున్న ఇద్దరు కుమారులున్నారు. గురువారం పరిషత్ ఎన్నికల్లో ఓటేసిన కొన్ని గంటల తరువాత ఆమెకు గ్యాస్ట్రిక్ నొప్పి రావటంతో దేవరపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఇంటికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం మళ్లీ నొప్పి రావటంతో రాజమహేంద్రవరం తీసుకెళ్లగా గుండెపోటుతో ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి విస్తృతంగా ప్రచారం చేసిన దివ్య.. గెలుపొందిన ఆనందం పంచుకోకుండానే కన్నుమూసిందని పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వజ్రోత్సవాల్లో గవర్నర్



స్కౌట్స్, గైడ్స్ కార్యక్రమాలు విద్యార్థులకు పుస్తక విజ్ఞానంతోపాటు సామాజిక బాధ్యతను నేర్పుతాయి. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులు, ప్రజా సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనేలా యువతను ప్రోత్సహిస్తాయి. సమాజంలో ఐక్యత, సహకారం, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందించడంలో ఈ సంస్థలు విశేషంగా దోహదపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సంస్థ కార్యక్రమాలు చేరువ కావడం ద్వారా మరింత మంది యువతకు సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. యువతలో దేశభక్తి, సమాజ సేవ పట్ల ఆసక్తిని పెంపొందించడమే సంస్థ ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా కొనసాగుతోంది. 75వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలతో సంస్థ ప్రస్థానాన్ని, ఇప్పటివరకు అందించిన సేవలను మరోసారి గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తులోనూ యువతను సేవా మార్గంలో నడిపిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమం సంస్థ వజ్రోత్సవ వేడుకల్లో ముఖ్య ఘట్టంగా నిలిచింది.

రీకౌంటింగ్ కోసం రోజా నిరసన



ఫలితంపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా ఆందోళనకు దిగారు. నగిరి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రం ఎదుట పార్టీ శ్రేణులతో కలిసి బైఠాయించారు. ఇల్లత్తూరు ఎంపీటీసీ స్థానానికి సంబంధించిన ఫలితంపై స్పష్టత ఇవ్వాలని, రీకౌంటింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగిస్తామని పార్టీ శ్రేణులు స్పష్టం చేశాయి.కౌంటింగ్ కేంద్రం ఎదుట వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరడంతో అక్కడ రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఫలితాల ప్రకటనలో జరిగినట్లు చెబుతున్న పొరపాట్లపై అధికారులు వివరణ ఇవ్వాలని నిరసనకారులు కోరారు. ఓట్ల లెక్కింపులో పారదర్శకత పాటించాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తూ, అభ్యంతరాలను అధికారికంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామంతో నగిరి డిగ్రీ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఇల్లత్తూరు ఎంపీటీసీ స్థానం ఫలితంపై వైసీపీ చేసిన ఆరోపణలు, రీకౌంటింగ్ డిమాండ్‌పై అధికారుల నుంచి పూర్తి వివరణ రావాల్సి ఉంది. ఓట్ల లెక్కింపు వివరాలను మరోసారి పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని వైసీపీ నేతలు కోరుతున్నారు. ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు తలెత్తకుండా అభ్యంతరాలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదంపై ఎన్నికల అధికారులు తీసుకునే తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది.


ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి: చంద్రబాబు

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి

చెడుపై మంచి విజయానికి ప్రతీకగా పండుగ

ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలి


సమాజంలో ఐకమత్యం, పరస్పర సహకారం పెరగాలని ఆకాంక్ష



అమరావతి, రాజధాని వాయిస్ : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నరకాసురుడి చెర నుంచి లోకానికి విముక్తి కలిగిన సందర్భాన్ని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పండుగను జరుపుకోవాలని కోరుకున్నారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు చిగురించాలని, భవిష్యత్తుపై నమ్మకం, ఆశావహ దృక్పథం పెంపొందాలని పేర్కొన్నారు. పండుగలు మన జీవితాల్లో ఆనందాన్ని నింపడంతో పాటు మంచి ఆలోచనలకు మార్గం చూపుతాయని తెలిపారు. ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, సంతోషం కలగాలని కోరుకుంటూ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. మనం వెలిగించే ప్రతి దీపం కేవలం మన ఇంటికే పరిమితం కాకుండా సమాజానికి కూడా వెలుగునివ్వాలని ముఖ్యమంత్రి సందేశమిచ్చారు. మన చుట్టూ ఉన్నవారి జీవితాల్లో సంతోషాన్ని నింపడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం కూడా పండుగలో భాగం కావాలని సూచించారు. పండుగ వేళ ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ఆప్యాయత, దయ, సహృదయంతో వ్యవహరించాలని ఆకాంక్షించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో ఆనందం నిండినప్పుడే పండుగకు నిజమైన సార్థకత చేకూరుతుందని సందేశమిచ్చారు. మన సంప్రదాయాలు, పండుగలు అందించే సందేశాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని చంద్రబాబు పేర్కొన్నారు. పరస్పర సహకారం, ఐకమత్యం, సోదరభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత సంతోషంతో పాటు సమాజ శ్రేయస్సుకు కూడా ప్రాధాన్యమివ్వాలని సూచించారు. విభేదాలను పక్కనపెట్టి ఒకరికొకరు తోడుగా నిలుస్తూ సమష్టి అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. దీపావళి పండుగ రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో ప్రశాంతత, ప్రతి ఒక్కరి జీవితంలో అభివృద్ధి వెల్లివిరియాలని కోరుకున్నారు. పండుగ ఇచ్చే మంచితనం, ఐకమత్యం, సంతోషం అనే సందేశాలను ఆచరణలో పెట్టాలని సూచించారు.

విశాఖలో పెట్టుబడుల సదస్సుకు భారీ ఏర్పాట్లు

సదస్సులో జరిగే చర్చలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని పేర్కొన్నారు.రాష్ట్రంలోని పరిశ్రమలను ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలని ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అంతర్జాతీయ స్థాయిలో కొత్త వ్యాపార పరిచయాలు, భాగస్వామ్య అవకాశాలు కల్పించాలని సూచించారు. చిన్న పరిశ్రమలు కూడా ప్రపంచ సరఫరా వ్యవస్థల్లో భాగస్వాములయ్యేలా సదస్సు వేదికను వినియోగించుకోవాలని అన్నారు. రాష్ట్రంలో తయారీ రంగం, ఎగుమతులు, పారిశ్రామిక కార్యకలాపాల విస్తరణకు ఈ సమావేశాలు దోహదపడేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.హరిత ఇంధనం, సాంకేతిక రంగం, అర్థవాహక పరికరాల తయారీ వంటి కీలక రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను అంతర్జాతీయ ప్రతినిధులకు విస్తృతంగా వివరించాలని చంద్రబాబు సూచించారు. అత్యుత్తమ విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన మౌలిక సదుపాయాలు, విజ్ఞాన సంపద, సమర్థ నాయకత్వం రాష్ట్రానికి ప్రధాన బలాలని వివరించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడం సురక్షితమని, వ్యాపార నిర్వహణ సులభతరమని పారిశ్రామికవేత్తలకు స్పష్టమైన సందేశం వెళ్లాలని కోరారు. పెట్టుబడిదారుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు భారత పరిశ్రమల సమాఖ్య డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సుకు



హాజరయ్యే విదేశీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఏర్పాట్లు సమర్థంగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక సామర్థ్యాన్ని చాటడంతోపాటు, పెట్టుబడుల ఆకర్షణకు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. విశాఖ వేదికగా జరిగే ఈ సమావేశాల ద్వారా రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు అందుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

జడ్పీల్లోనూ జయహో

ప్రతి దశలోనూ కూటమి స్పష్టమైన ఆధిపత్యం కనబరిచింది.

మొన్న పట్టణం.. ఇప్పుడు పల్లె.. ఫలితం ఒక్కటే!

మున్సిపల్ ఎన్నికల్లో సాధించిన ఫలితాల్నే పరిషత్ ఎన్నికల్లోనూ కూటమి పునరావృతం చేసింది. పల్లె, పట్నం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజలు కూటమినే కోరుకుంటున్నారనడానికి ఈ ఎన్నికలు అద్దం పట్టాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత రెండున్నరేళ్లకు జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికలు కూటమి ప్రభుత్వ పాలనకు రిఫరెండం వంటివే! ఈ రెండున్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజాదరణ చూరగొన్నాయడానికి.. రాష్ట్రంలో శాంతియుత పరిస్థితుల్ని, సుస్థిర అభివృద్ధిని కోరుకుంటున్నారనడానికి వారి ఏకపక్ష తీర్పే నిదర్శనం. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించింది. కూటమికి నగరపాలక సంస్థల్లో 60.34 శాతం ఓట్లు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో 60.12 శాతం ఓట్లు వచ్చాయి. పరిషత్ ఎన్నికల్లోనూ అది పునరావృతమైంది. పురపాలక ఎన్నికల్లో అనంతపురం కార్పొరేషన్‌తో పాటు, నందికొట్కూరు, బేతంచెర్ల, నాయుడుపేట మున్సిపాలిటీలను మాత్రమే వైకాపా గెలవగలిగింది. ఇప్పుడు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలనూ ఆ పార్టీ స్వల్ప సంఖ్యలోనే గెలిచింది. ఏకగ్రీవాల నుంచే స్పష్టమైన ఆధిక్యతపరిషత్ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ఎంపీపీ, జడ్పీటీసీలను ఏకగ్రీవంగా గెలుచుకోవడం ద్వారా కూటమి ఆరంభంలోనే వైకాపాను ఆత్మరక్షణలోకి నెట్టేసింది. అక్కడి నుంచి ఏ దశలోనూ కోలుకోకుండా చేసింది. మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు 76, మొత్తం 9,829 ఎంపీటీసీలకు 1,938 కూటమి ఏకగ్రీవంగా గెలుచుకుంది.



ఆచార్య ఎన్.జి.రంగా 126వ జయంతి వేడుకలు



బాపట్ల, రాజధాని వాయిస్ : బాపట్ల పట్టణంలోని అగ్రికల్చర్ కాలేజీ ప్రాంగణంలో భారత రైతాంగ ముద్దుబిడ్డ, మహోన్నత రైతు నాయకుడు 'రైతు బాంధవుడు' ఆచార్య ఎన్.జి. రంగా 126వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నాయకులు లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆచార్య రంగా నూతన విగ్రహాన్ని ఆవిష్కరించి, ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ...మన ఉమ్మడి గుంటూరు గడ్డపై, నిడుబ్రోలులో జన్మించిన ఆచార్య ఎన్.జి. రంగా గారు యావత్ భారత రైతాంగానికి ఒక ధైర్యాన్ని, గొంతుకను అందించిన మహనీయుడని కొనియాడారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా పుచ్చుకుని, విదేశాలలో ఎన్నో ఉన్నత పదవులు అధిష్టించే అర్హత ఉన్నప్పటికీ... తన చదువు, ప్రతిభ పరాయి దేశాల కోసం కాకుండా కష్టపడే మన రైతుల కోసం, కన్నీళ్లు పెట్టుకునే వ్యవసాయ కూలీల కోసమేనని మాతృభూమికి తిరిగి వచ్చిన గొప్ప దార్శనికుడు అని తెలిపారు. 1933లోనే నిడుబ్రోలులో రైతుల కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసి, రైతు బిడ్డలకు రాజకీయ, ఆర్థిక శాస్త్రాలను నేర్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.దాదాపు ఆరు దశాబ్దాల పాటు పార్లమెంటులో సభ్యుడిగా సేవలందించి, గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన ఏకైక ప్రజాప్రతినిధి రంగా గారేనని గుర్తుచేశారు. ఢిల్లీ పార్లమెంటులో ఏ ప్రధానమంత్రి ఉన్నా, ఏ చట్టం చర్చకు వచ్చినా... "దీనివల్ల నా దేశ రైతుకు, నా పల్లెటూరి రైతుకూలీకి ఏం న్యాయం జరుగుతుంది?" అని నిలదీసిన ఆ ధైర్యశాలి ఆశయాలను మనం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు."రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది" అనేదే రంగా నమ్మిన ప్రాథమిక సిద్ధాంతమని, ఆయన జయంతి సందర్భంగా విగ్రహాలకు దండలు వేసి దణ్ణాలు పెట్టడం మాత్రమే కాకుండా, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ స్పష్టం చేశారు. రైతుల హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన రంగా బాటలో నడుస్తూ... ప్రతి రైతుకూ సాగునీరు సక్రమంగా అందేలా, పంటకు న్యాయమైన గిట్టుబాటు ధర దక్కేలా మరియు వ్యవసాయాన్ని అత్యంత గౌరవప్రదమైన వృత్తిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం తరపున, ప్రజాప్రతినిధిగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు, రైతులకు మాటిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రనిధులు, కాలేజీ ప్రధానాచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు మరియు పెద్దఎత్తున రైతులు పాల్గొని మహనీయుని స్మృతికి ప్రణామాలు అర్పించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఇంటి నుంచే ప్రారంభం కావాలి

ప్రతి పౌరుడూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలి
రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే
మంగళగిరి ఎకో పార్కులో ఘనంగా బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల ముగింపు



మంగళగిరి, రాజధాని వాయిస్ : పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా గుర్తించాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే పిలుపునిచ్చారు. పర్యావరణహిత జీవనశైలిలో మార్పు ముందుగా మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు 'ఒక వారం.. ఏడు ఆచరణలు.. ఒకే భూగోళం' అనే నినాదంతో నిర్వహించిన 'బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు--2026' ముగింపు కార్యక్రమం శనివారం మంగళగిరి ఎకో పార్కులో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంతిలాల్ దండే మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో బ్రిక్స్ దేశాల భాగస్వామ్యం కీలకమన్నారు. ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో స్వచ్ఛంద కార్యకర్తగా మారాలని కోరారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు చేసుకోవాలని, ఈ మార్పును కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి సమాజమంతటికీ విస్తరింపజేయాలని సూచించారు.రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరిస్తూ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 660 మండలాల్లో స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేసి పొడి వ్యర్థాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కిలో ప్లాస్టిక్ వ్యర్థాలకు రూ.20 విలువైన నిత్యావసర వస్తువులను గ్రీన్ షాపుల ద్వారా అందించే విధానాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. వేస్ట్ టు వెల్త్ కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నుంచి వర్మీ కంపోస్ట్ తయారుచేసి మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు పాఠశాలలకు స్టీల్ వాటర్ బాటిళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు పెద్ద పెద్ద కార్యక్రమాలే అవసరం లేదని, నిత్యజీవితంలో పాటించే చిన్న చిన్న అలవాట్లే ప్రకృతిని కాపాడతాయని పేర్కొన్నారు. పళ్లు తోముకునేటప్పుడు నీటిని వృథా చేయకుండా కుళాయి మూసివేయాలని, మార్కెట్‌కు వెళ్లేటప్పుడు గుడ్డ లేదా జూట్ సంచులను తీసుకెళ్లి ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. వేడుకలు, శుభకార్యాల్లో అవసరమైనంత ఆహారాన్నే తీసుకోవాలని, ఆహార వృథాను అరికట్టాలని కోరారు. గదుల నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఫ్యాన్లు, లైట్లు ఆపి విద్యుత్‌ను ఆదా చేయాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వివిధ సంస్థల సమన్వయంతో సుమారు నాలుగు వేల కార్యక్రమాలు నిర్వహించగా, రెండు లక్షల మంది పాల్గొన్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై చేసిన ప్రతిజ్ఞను ఆచరణలో చూపాలని పిలుపునిచ్చారు.ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డాక్టర్ పి.వి. చలపతిరావు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం కావాలన్నారు. స్వాతంత్ర్య శతాబ్ది నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 2028 నాటికి 80 శాతం గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థల్లో మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు.ఆహారపు అలవాట్ల నుంచి భవన నిర్మాణాల వరకు ప్రతి అంశంలోనూ ప్రకృతి వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యర్థాలను తగ్గించడం, పునర్వినియోగం చేయడం ద్వారా కాలుష్య రహిత వాతావరణాన్ని నిర్మించవచ్చన్నారు. వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన స్టేట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మహమ్మద్ దివాన్ మొహిద్దీన్ నాయకత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం విద్యార్థులు, అధికారులతో పర్యావరణహిత జీవనశైలి పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మిషన్ లైఫ్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సందర్శించారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు బి.ఎన్.ఎన్. మూర్తి, రేవతి, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ శరవణన్, స్టేట్ విజిలెన్స్ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ అధికారులు ధర్మ రక్షిత, శ్రీ సాయి, వివిధ స్థాయిల అటవీ శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు

కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల



నరసరావుపేట, రాజధాని వాయిస్ జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల తెలిపారు.ఈ మేరకు ఏఎం రెడ్డి కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. కౌంటింగ్ హాళ్లలో చేపడుతున్న ఏర్పాట్లు, బ్యాలెట్ల వర్గీకరణ, లెక్కింపు విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శనివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేపట్టిన అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ల వర్గీకరణ, లెక్కింపు ప్రక్రియను అన్ని కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా కౌంటింగ్ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని వివరించారు.అదేవిధంగా ప్రతి కౌంటింగ్ హాల్‌ను స్వయంగా పరిశీలించి, లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరిగేలా అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.ఈ పర్యటనలో జిల్లా ఎన్నికల పరిశీలకులు శ్రీవాస్ నుహూర్, జాయింట్ కలెక్టర్ సంజన శ్రీహర్ష పాల్గొన్నారు.

స్వచ్ఛ నరసరావుపేటే లక్ష్యం

స్వయంగా చీపురు పట్టి శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు
పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత
చిలకలూరిపేట రోడ్డు ఫ్లైఓవర్ వద్ద విస్తృతంగా పారిశుద్ధ్య పనులు
కార్యకర్తలతో కలిసి స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొని ఆదర్శంగా నిలిచిన శాసనసభ్యులు



నరసరావుపేట,రాజధాని వాయిస్ పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యకరమైన సమాజానికి అసలైన పునాది అని, 'స్వచ్ఛ నరసరావుపేట -- ఆరోగ్య నరసరావుపేట' సాధనే తమ ప్రధాన లక్ష్యమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్పష్టం చేశారు. నరసరావుపేట నుంచి చిలకలూరిపేట వెళ్లే రహదారిలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో శనివారం భారీ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్వయంగా పాల్గొని, చేత చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేసి స్థానిక ప్రజలకు, నాయకులకు ఆదర్శంగా నిలిచారు. కార్యకర్తలతో కలిసి స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో భాగస్వామ్యం పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకులు కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా స్వయంగా శ్రమించి ప్రజలకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల నుంచి పరిశుభ్రతను ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే నరసరావుపేటను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దగలమని ఆయన ఆకాంక్షించారు. ఈ శానిటేషన్ డ్రైవ్‌లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసినా, తయారు చేసినా ఉపేక్షించేది లేదు
ప్రభుత్వ అనుమతులు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి



గుంటూరు, రాజధాని వాయిస్ : దీపావళి పండుగ నేపథ్యంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేయడం, విక్రయించడం, తయారు చేయడం వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ హెచ్చరించారు. పేలుడు పదార్థాల చట్టం ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఈ మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఎస్పీ పలు ఆదేశాలు జారీ చేశారు. లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయించే వారిపై, బహిరంగ ప్రదేశాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేసే వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బాణసంచా వ్యాపారులు ముందస్తుగా ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు పొందిన తర్వాతే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత రుసుములు చెల్లించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయించిన ప్రదేశాల్లోనే విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయరాదని తెలిపారు.గతంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదాలు, భద్రతా లోపాలను దృష్టిలో ఉంచుకుని బాణసంచా దుకాణాల నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి దుకాణంలో నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడంతో పాటు, సిబ్బందికి అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. చిన్నపిల్లలను బాణసంచా విక్రయ పనుల్లో నియమించుకోరాదని స్పష్టం చేశారు.జిల్లావ్యాప్తంగా అనధికారికంగా బాణసంచా నిల్వ చేయడం, విక్రయించడం, తయారు చేయడంపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని తెలిపారు. అనుమతులు లేని దుకాణాలు, అక్రమ నిల్వలపై ఆకస్మిక తనిఖీలు, దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వ చేసినా, విక్రయించినా ప్రజలు వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, దీపావళి పండుగను ప్రమాదరహితంగా జరుపుకునేందుకు వ్యాపారులు, ప్రజలు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, తెనాలి కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్





గుంటూరు, రాజధాని వాయిస్ : జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని వెల్లడించారు.ఈ నేపథ్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, తెనాలిలోని వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సందర్శించి, ఓట్ల లెక్కింపు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో జరుగుతున్న లెక్కింపు విధానం, అక్కడి పరిస్థితులు, పోలీసు బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతా ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తతను పరిశీలించారు. కేంద్రాల లోపల, వెలుపల ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను సమీక్షించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు జరిగితే తక్షణమే స్పందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రస్తుతం జిల్లాలోని కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, విజయోత్సవాలు, ర్యాలీల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేలా పోలీసు శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని తెలిపారు.ఈ తనిఖీల్లో ఎస్పీ వెంట అదనపు ఎస్పీ (పరిపాలన) జీవీ రమణమూర్తి, అదనపు ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏటీవీ రవికుమార్, నార్త్ డీఎస్పీ కె. వెంకటేశ్వర్లు, తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, పెదకాకాని సీఐ నారాయణస్వామి, మంగళగిరి రూరల్ సీఐ సీహెచ్ వెంకట్, సీఐలు రాంబాబు, రవీంద్రబాబు, శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

టాప్ కిడ్స్ స్కూల్‌లో ఘనంగా విజ్ఞాన ప్రదర్శన

సృజనాత్మకతకు అద్దం పట్టిన ఎడ్యుకేషనల్ ఫెయిర్
ఎలక్ట్రిక్ కార్ ఇగ్నైటే ప్రత్యేక ఆకర్షణ

గుంటూరు.నవంబర్ 7రాజధాని వాయిస్: విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో గుంటూరులోని టాప్ కిడ్స్ స్కూల్‌లో శనివారం ఎడ్యుకేషనల్ ఫెయిర్ ఘనంగా నిర్వహించారు.ఈ ప్రదర్శనలో వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు సైన్స్, గణితం, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు తదితర సబ్జెక్టులకు సంబంధించిన వినూత్న ప్రాజెక్టులు, నమూనాలు, ప్రయోగాలను ప్రదర్శించారు. పాఠ్యాంశాలను ఆచరణాత్మకంగా వివరిస్తూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.పాఠశాల డైరెక్టర్ లతా థామస్, ప్రిన్సిపాల్ శేఖర్ బాబు ప్రతి ప్రాజెక్టును సందర్శించి విద్యార్థుల కృషి, ఆలోచనా విధానం, సృజనాత్మకతను అభినందించారు.పలువురు తల్లిదండ్రులు కూడా హాజరై పిల్లలను ప్రోత్సహించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఇగ్నైటే ఎలక్ట్రిక్ కార్ ప్రత్యేక ఆకర్షణ

ఈ ప్రదర్శనలో పదో తరగతి విద్యార్థి కొల్లా అభినవ్ రూపొందించిన ఇగ్నైటే ఎలక్ట్రిక్ కార్ ప్రాజెక్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాటరీ విద్యుత్ శక్తితో నడిచే ఈ కారును వినూత్నంగా రూపొందించి, గంటకు సుమారు 100 కిలోమీటర్ల వేగాన్ని లక్ష్యంగా చేసుకుని అభివృద్ధి చేయడం విశేషం. అభినవ్ సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనా ఆసక్తి, పట్టుదలకు ఈ ప్రాజెక్ట్ నిదర్శనంగా నిలిచింది.

విద్యార్థులు కేవలం మార్కుల సాధనకే పరిమితం కాకుండా కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి: ప్రిన్సిపాల్ శేఖర్ బాబు

ప్రతి విద్యార్థి తనకంటూ ఒక వినూత్న ఆలోచనను అభివృద్ధి చేసుకుని భవిష్యత్తులో సొంత స్టార్టప్‌లను ప్రారంభించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగాల కోసం వెతికే వారిగా కాకుండా, ఇతరులకు ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు, బృంద స్ఫూర్తిని పెంపొందిస్తాయని డైరెక్టర్ లతా థామస్ పేర్కొన్నారు.విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల



మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎడ్యుకేషనల్ ఫెయిర్ విజయవంతంగా ముగిసింది.నేర్చుకోవడం మాత్రమే కాదు. నూతనంగా సృష్టించడం నేర్చుకోండి. ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగండి అనే సందేశాన్ని ఈ ప్రదర్శన చాటిచెప్పింది.

పెద్దాపురం కౌంటింగ్ కేంద్రంలో భద్రతపై ఎస్పీ పరిశీలన

కాకినాడ జిల్లా, రాజధాని వాయిస్ : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ పెద్దాపురంలోని మహారాణి ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో పోలీసు బందోబస్తు, ప్రవేశ మార్గాలు, ఇతర భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించిన బాధ్యతల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కేంద్రంలోకి ప్రవేశించే వ్యక్తుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అనుమతి పొందిన వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. గుర్తింపు, అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ప్రవేశం కల్పించాలని తెలిపారు. అనధికార వ్యక్తులు లోపలికి రాకుండా ప్రవేశ ద్వారాల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద గుమిగూడే ప్రజలను క్రమబద్ధీకరించడంతోపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు



చేపట్టాలని సూచించారు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు, సిబ్బంది ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బిందు మాధవ్ స్పష్టం చేశారు. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన కౌంటింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు.

బాపట్ల జిల్లాలో ప్రారంభమైన ఓట్ల లెక్కింపు

బాపట్ల, రాజధాని వాయిస్ : బాపట్ల జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. వినోద్ కుమార్ పర్యవేక్షణలో లెక్కింపు కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కేంద్రాల పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లతో పాటు లెక్కింపు ప్రక్రియకు అవసరమైన సదుపాయాలను కల్పించారు. ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన విధులను నిర్వహిస్తూ లెక్కింపు ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు నిబంధనలను పాటించేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.జిల్లా కేంద్రంలోని ఎన్నికల నియంత్రణ గది నుంచి వెబ్ ప్రసారాల ద్వారా అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఐదు కేంద్రాల్లో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సూచనలు అందిస్తున్నారు. లెక్కింపులో పారదర్శకత, క్రమబద్ధత పాటించేలా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించేలా సంబంధిత యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద లేదా పరిసర ప్రాంతాల్లో ఏదైనా సమస్య తలెత్తితే ప్రజలు వెంటనే జిల్లా ఎన్నికల నియంత్రణ కేంద్రానికి సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఇందుకోసం 08643-220226 నంబరును అందుబాటులో ఉంచారు. అలాగే 871241 7880 వాట్సాప్ నంబరుకు కూడా వివరాలు పంపవచ్చని



తెలిపారు. సమస్యలను ఆలస్యం చేయకుండా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఎన్నికల లెక్కింపు పూర్తయ్యే వరకు అన్ని కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేపడుతూ అవసరమైన సమన్వయం కొనసాగిస్తోంది. ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నిబంధనలకు సహకరించాలని అధికారులు కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఓట్ల లెక్కింపు సజావుగా పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

కూటమి విజయోత్సాహంతో హోంమంత్రి అనిత నివాసం వద్ద సంబరాలు

నక్కపల్లి. నవంబర్ 7 రాజధాని వాయిస్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీలతో విజయం సాధించడంతో నక్కపల్లి లోని హోంమంత్రి వంగలపూడి అనిత నివాసం వద్ద విజయోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఎన్నికల ఫలితాలతో హోంమంత్రి నివాసం కోలాహలంగా మారింది. కూటమి అభ్యర్థుల విజయంతో ఉత్సాహంగా ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హోంమంత్రి అనిత నివాసానికి చేరుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. డప్పుల మోతలు, నినాదాల మధ్య కార్యకర్తలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ విజయోత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనితను కలిసిన కూటమి నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో సాధించిన విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అందించిన మద్దతుకు నాయకులు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.కార్యకర్తలతో కలిసి విజయోత్సవాల్లో పాల్గొన్న




హోంమంత్రి అనిత వారికి అభినందనలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని కూటమి శ్రేణులకు సూచించారు. దీంతో నక్కపల్లిలోని హోంమంత్రి నివాసం వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

కూటమి విజేతలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుభాకాంక్షలు



వెల్దుర్తి జడ్పీటీసీ
బత్తుల అంకమరావు



మాచర్ల మండలం జడ్పీటీసీ
గుండాల శ్రీనివాసరావు



రెంటచింతల జడ్పీటీసీ
మున్నా నాగేంద్రమ్మ



దుర్గి జడ్పీటీసీ.
బృంగా నాగజ్యోతి



కారంపూడి జడ్పీటీసీ.
కొండపల్లి శివకుమారి



మాచర్ల.నవంబర్ 7 రాజధాని వాయిస్ : పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో విజ యం సాధించిన కూటమి అభ్యర్థులకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పర్వది నాన్ని పురస్కరించుకుని విజేతలకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఐదు జెడ్పీటీసీ స్థానాలను, 71 ఎంపీటీసీ స్థానాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్న కూటమి అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు కారంపూడి మండలం నుంచి కొండపల్లి శివకుమారి, దుర్గి మండలం నుంచి బృంగా నాగజ్యోతి, రెంటచింతల మండలం నుంచి మున్నా నాగేంద్రమ్మ, మాచర్ల మండలం నుంచి గుండాల శ్రీనివాసరావు, వెల్దుర్తి మండలం నుంచి బత్తుల అంకమరావులకు ఎమ్మెల్యే దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విజేతలం దరూ పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు.

వంగవీటి రాధాకృష్ణకు గళ్ళా మాధవి అభినందనలు

విజయవాడ, రాజధాని వాయిస్ : విజయవాడ నగర పాలక సంస్థ నూతన మేయర్‌గా ఎన్నికైన వంగవీటి రాధాకృష్ణను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. గళ్ళా రామచంద్రరావుతో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మొక్కను అందించి, శాలువాతో సత్కరించారు. మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తే నాయకుడిగా వంగవీటి రాధాకృష్ణకు గుర్తింపు ఉందన్నారు. అలాంటి నాయకుడు విజయవాడ నగర మేయర్‌గా ఎన్నిక కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగర పాలన సాగిస్తూ, నగర అభివృద్ధికి ఆయన తన నాయకత్వాన్ని అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు .విజయవాడ నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి కీలక అంశాల్లో విశేష పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు.నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన జీవన సదుపాయాలు కల్పించాలని గళ్ళా మాధవి పేర్కొన్నారు. పారిశుద్ధ్య



నిర్వహణను నిరంతరం పర్యవేక్షించడం, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడం, మౌలిక సదుపాయాలను విస్తరించడం ద్వారా విజయవాడను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దవచ్చని అభిప్రాయపడ్డారు. నగర పాలక సంస్థ పాలకవర్గం ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. వంగవీటి రాధాకృష్ణ నాయకత్వంలో విజయవాడ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. నూతన మేయర్‌కు అభినందనలు తెలియజేస్తూ నగర అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

మంగళగిరి, రాజధాని వాయిస్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రతి పరిశ్రమ నీటిని, ఇంధనాన్ని పొదుపుగా వినియోగించాలని ఏపీఐఐసీ గుంటూరు జోనల్ మేనేజర్ ఎం. నరసింహారావు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రకృతి వనరులను కాపాడుకోవడం సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా ఏపీఐఐసీ, ఐలా యర్రబాలెం (నవులూరు) సంయుక్త ఆధ్వర్యంలో యర్రబాలెంలోని భగవాన్ మహావీర్ గోశాలలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఐఐసీ గుంటూరు జోనల్ మేనేజర్ నరసింహారావు మాట్లాడుతూ.. ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు.పరిశ్రమల యాజమాన్యాలు తమ కంపెనీల ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి, వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణహిత విధానాలను పరిశ్రమల్లో అమలు చేస్తూ, ఉద్యోగులు, కార్మికులను సైతం చైతన్యవంతం చేయాలని కోరారు.ఐలా కమిషనర్ ఎం.డి. అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ.. కార్మికులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నీటి వృథాను అరికట్టాలని సూచించారు. నీటిని పొదుపు చేసుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.సదస్సు అనంతరం పారిశ్రామికవాడలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. రామరాజు, కార్యదర్శి సీతారామ శర్మ, మాజీ అధ్యక్షుడు ఆకుల అజయ్ బాబు, నాయకులు ఎం. కోటేశ్వరరావు, శ్రీనివాస్, రాధిక, ఆంజనేయులు, ఏపీఐఐసీ సిబ్బంది మోహన్, మరియదాస్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.





గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ముఖ్యం ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ పిలుపు

అమరావతి.నవంబర్ 7 రాజధాని వాయిస్ : పుట్టి పెరిగిన ఊరు, తల్లిదండ్రులు, బంధువులు, బాల్యపు జ్ఞాపకాల సమాహారమైన సొంతూరిని అభివృద్ధి చేసుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని యూఎస్ఏకు చెందిన ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ పేర్కొన్నారు. వృత్తి, ఉపాధిరీత్యా పట్టణాలలో లేదా విదేశాలలో ఉంటున్నా జన్మభూమి పట్ల బాధ్యత ఎప్పటికీ మరవకూడదన్నారు. రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు, గ్రామ స్వరాజ్యం సాకారం కావాలంటే గ్రామ సభలు, పంచాయతీ నిధులు, పారదర్శక నిర్ణయాలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. వందలాది మంది విద్యావంతులు ఉన్నప్పటికీ, కొందరు అవగాహన లేని వ్యక్తుల చేతుల్లో గ్రామ నాయకత్వం చిక్కుకోవడం వల్ల గ్రామ స్వరాజ్యం కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావంతులు, యువత, మహిళలు, వ్యాపారులు, ఎన్ఆర్ఐలు అంతా ఏకమై గ్రామాల్లోని పరిస్థితులపై ఆలోచించాలని కోరారు. మరో రెండు మూడు వారాలలో జరగబోయే పంచా



యతీ ఎన్నికల్లో కుల, మత, పార్టీలకంటే ఎక్కువగా క్రమశిక్షణ, వ్యక్తిత్వం, అభివృద్ధి కాంక్ష కలిగిన నిజమైన నాయకత్వాన్ని మన ఓటు హక్కు ద్వారా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని, చైతన్యవంతమైన మన ఓటుతోనే గ్రామాల భవిష్యత్తును మార్చుకుందామని జైహింద్ అంటూ తన సందేశాన్ని ముగించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com